# గులాబీ పాగా

- 1994నుంచి హస్తంకు మొండిచెయ్యే
- మూడు దశాబ్దాలుగా వరుస ఓటములు
- నాడు నాగం, నేడు మర్రి హవా
- ఈసారి గులాబీ పార్టీదే జోరు
- మెజార్టీ కోసమే మర్రి ప్రచారం



నాగర్కర్నూల్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ) :నాగర్కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు రిక్త హస్తం ఎదురవుతోంది. గత మూడు దశాబ్దాల నుంచి జరిగిన ఏ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ గెలుపు రుచి చూడలేదు. 1952లో నాగర్‌కర్నూల్ అసెంబ్లీ ఏర్పాటు కాగా 1983 ఎన్నికల వరకూ కాంగ్రెస్సే గెలుస్తూ వచ్చింది. నాగం జనార్దన్ తెలుగుదేశం పార్టీ తరఫున 1985లో ఎమ్మెల్యేగా గెలుపొందగా 1989లో మరొకసారి కాంగ్రెస్ నుంచి వీఎన్ గౌడ్ గెలిచారు. ఇక 1994లో రెండో సారి గెలిచాక 2012(ఉప ఎన్నిక) వరకు కూడా నాగం హవా నడిచింది. రాష్ట్రంలో అధికార పక్షంతో సంబంధం లేకుండా నాగం గెలుస్తూ రాగా కాంగ్రెస్ కేవలం ఎన్నికల్లో పోటీకే పరిమితమైంది. గెలుపు అంచనాకు ఆమడ దూరంలోనే నిలుస్తూ వస్తోంది. ఫలితంగా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఉనికి లేకుండా పోయింది. ఆ తర్వాత 2014లో తెలంగాణ ఏర్పాటుతో బీఆర్ఎస్ ప్రభంజనం కొనసాగింది. మర్రి జనార్దన్‌రెడ్డి గత రెండు ఎన్నికల్లోనూ వరుసగా గెలుస్తూ వచ్చారు. నియోజకవర్గ ఎన్నికల చరిత్రలోనే లేనట్లుగా 2018 ఎన్నికల ఫలితాల్లో ఏకంగా 54వేల ఓట్ల మెజార్టీ రావడం విశేషం. ఫలితంగా కాంగ్రెస్‌కు మూడు దశాబ్దాల నుంచి గెలుపన్నది లేకపోవడంతో నాయకులు, కార్యకర్తలు గూడు చెదిరిన పక్షుల్లా ఇతర పార్టీలకు వలస వెళ్లారు. 2018లో నాగం జనార్దన్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి పోటీ చేశారు. ఇటీవలి వరకూ నాగం, దామోదర్‌రెడ్డి విభేదాలతో కాంగ్రెస్‌లో ఎన్నికల ముందు నిస్తేజం నెలకొంది. కాంగ్రెస్ ఓటమే ధ్యేయంగా నాగం బీఆర్ఎస్‌లో చేరి మర్రి గెలుపు కోసం కంకణం కట్టుకున్నారు. నాగం బీఆర్ఎస్‌లో చేరడంతో ఆయనతో పాటుగా పెద్ద ఎత్తున అనుచరులు కాంగ్రెస్‌ను వీడారు. కాంగ్రెస్‌లో చేరిన చాలా మంది నేతలు, కార్యకర్తలు తిరిగి బీఆర్ఎస్ కండువాలు కప్పుకొంటున్నారు. దీనివల్ల ప్రతిరోజూ బీఆర్ఎస్ కార్యాలయంలో చేరికల సందడి కనిపిస్తోంది. ఫలితంగా కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో ఉనికి చాటుకొనే ప్రయత్నం చేస్తోంది. ఇదే క్రమంలో బీఆర్ఎస్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల తోపాటుగా నాగర్కర్నూల్ జిల్లా ఏర్పడడం, మెడికల్ కళాశాల ఏర్పాటు, ఎంజీకేఎల్‌ఐతో పాటుగా పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా వట్టెం రిజర్వాయర్ పనులు పూర్తవడం వంటి వాటితో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిపై ప్రజల్లో విశ్వాసం మరింత రెట్టింపైంది. తన సొంత ట్రస్టు ద్వారా నిర్వహించిన సామూహిక వివాహాలు, ఉచిత అన్నదానం క్యాంటీన్, నిరుద్యోగ యువతకు ఉద్యోగ శిక్షణలు, ఉచిత డ్రైవింగ్ లైసెన్సులు, ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించిన ప్రభుత్వ పాఠశాలలు ఆయనకు ఆదరణను పెంచాయి. ఈ ఎన్నికల్లో గెలిస్తే సీఎం కేసీఆర్ సహకారంతో మర్రి రాష్ట్ర రాజకీయాల్లో ఉన్నత పదవుల్లో ఉంటారనే అభిప్రాయం నాయకులు, కార్యకర్తలు, ప్రజల్లోనూ నెలకొంది. ప్రచారంలోనూ మర్రిని ప్రజలు ఈ విధంగానే ఆశీర్వదిస్తున్నారు. దీనివల్ల నియోజకవర్గ అభివృద్ధి మరింత పెరుగుతుందని ప్రజలు నమ్ముతున్నారు. ఇలా గతంలో నాగం, ప్రస్తుతం మర్రి జనార్దన్‌రెడ్డిల హవాతో కాంగ్రెస్‌కు కందనూలులో ఈ ఎన్నికలూ గత తాలూకు చేదు అనుభూవాలే మిగిలిస్తాయేమోననే ఆందోళన నాయకులు, కార్యకర్తల్లో నెలకొన్నాయి.

# రూ.5కే 'ఆహా'రం

- పేదల కడుపునింపుతున్న ఎమ్మెల్యే బండ్ల
- కేసీఆర్ స్టడీ సర్కిల్‌తో నిరుద్యోగులకు చేయూత
- వివిధ సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణ
- ఉచిత బస్‌పాసులు, డ్రైవింగ్ లైసెన్స్‌లు అందజేత
- ఆరోగ్య పరిరక్షణకు రూ.5 లక్షల బీమాతో భరోసా



విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే

గద్వాల, నవంబర్ 8: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్నారు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి. సీఎం కేసీఆర్‌తో మాట్లాడి ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తూ పుట్టిన గడ్డ రుణం తీర్చుకుంటున్నారు. ఓవైపు ప్రభుత్వ పథకాలను ప్రజల దరిచేర్చుతూనే తన సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నారు. నియోజకవర్గ ప్రజలు, నిరుద్యోగులు, విద్యార్థులకు చేయూతనిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నాడు. పదిమందికి మేలు చేయాలనే ఆలోచనతో సొంతగా డబ్బులు వెచ్చించి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ గద్వాల నియోజకరవ్గంలో తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. నియోజకరవ్గంలో చేపడుతున్న సంక్షేమ, సామాజిక సేవాకార్యక్రమాలపై 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనం..

**నిరుద్యోగులకు కేసీఆర్ స్టడీ సర్కిల్**

నిరుద్యోగులకు చేయూతనివ్వాలనే లక్ష్యంతో జిల్లా కేంద్రంలో 2015లో కేసీఆర్ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వం వివిధ పోటీ పరీక్షలకు నోటిఫికేషన్లు విడుదల చేయగా.. పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత ప్రభుత్వ కొలువు సాధించడంలో చేయూనివ్వాలనే సదుద్దేశంతో కేసీఆర్ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయ, ఎస్సై, కానిస్టేబుల్, గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న 4వేల మంది నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇప్పించడమే కాకుండా శిక్షణ పొందినవారికి రూ. కోటి50లక్షలు విలువ చేసే స్టడీ మెటీరియల్ అందజేశారు. 2018నుంచి ఇప్పటి వరకు 10వతరగతి విద్యార్థులకు ఉచిత స్టడీమెటీరియల్ అందించడం తోపాటు దూరప్రాంతాల నుంచి కాలినడకన పాఠశాలకు వెళ్లే 2వేలమందికి సైకిళ్లు అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి గద్వాలకు చదువుకునేందుకు బస్సుల్లో వచ్చే విద్యార్థులకు ఆర్టీసీకి ఒకేసారి ఏడాది డబ్బులు చెల్లించి ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పించారు.

**రూ.5కే రుచికరమైన భోజనం**

ప్రతిరోజూ గద్వాల నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వివిధ పనుల నిమిత్తం ప్రజలు జిల్లా కేంద్రానికి వస్తుంటారు. వారు హోటల్‌కు వెళ్లి భోజనం చేయాలంటే రూ. 100లేనిదే రాదు. ఇది గ్రహించిన ఎమ్మెల్యే అన్న దాతగా పేదలకు రూ.5కే నాణ్యమైన భోజనం అందించాలనే లక్ష్యంతో కేసీఆర్ క్యాంటిన్ ప్రారంభించి ప్రతిరోజూ 500 మందికి నాణ్యమైన, రుచికరమైన భోజనంతో కడుపు నింపుతున్నారు. కేసీఆర్ క్యాంటీన్‌కు మంచి ఆదరణ లభిస్తుంది.



కేసీఆర్ క్యాంటీన్ వద్ద రూ.5కే భోజనం అందిస్తున్న దృశ్యం

**ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌లు**

ప్రస్తుతం ఎక్కడ చూసిన రోడ్డు ప్రమాదాలు జరుగుతూ వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. వాహనాలు నడిపే వారికి డ్రైవింగ్ లైసెన్స్‌లు లేక పోవడంతో వారికి ఇన్సూరెన్స్‌రాక నానా అవస్థలు పడేవారు. దీంతో ఎమ్మెల్యే గద్వాల నియోజకవర్గాన్ని ప్రమాదరహితంగా తీర్చిదిద్దాలని వాహనం నడిపే ప్రతి ఒక్కరికీ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలనే ఆలోచనతో ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళా నిర్వహించి అర్హులైన ప్రతిఒక్కరికీ ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్ అందజేసేందుకు శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలో సుమారు 25వేల మందికి సొంత డబ్బుతో ఎల్ఎల్ఆర్ డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇప్పించారు.

**రూ.5లక్షల ఉచిత ఆరోగ్యబీమా**

ప్రస్తుతం మారుతున్న కాలాను గుణంగా ప్రజల జీవనవిధానంలో మార్పుల తోపాటు వారుతీసుకునే ఆహారం కల్తీది కావడంతో ప్రజలు వివిధ రోగాల బారిన పడుతున్నారు. రోగాల నుంచి బయటపడడానికి వేలకు వేలు ఖర్చు చేస్తున్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా గద్వాల నియోజకవర్గ ప్రజలకు రూ.5లక్షల విలువ చేసే ఆరోగ్య బీమా పథకం ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ బీమా పొందడంతో రాష్ట్రంలో నిర్ధేశించిన కార్పోరేట్ దవాఖానల్లో ఉచితంగా రూ.5లక్షల వరకు చికిత్స పొందే అవకాశం ఉంది. దీనికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తున్నది. ఇలా ఎమ్మెల్యే ప్రభుత్వం అందించే పథకాలు ప్రజల దరికి చేర్చుతూనే సామాజిక కార్యక్రమాలతో ప్రజలకు మరింత దగ్గరవుతున్నారు.

# నామినేషన్ల జోరు

- ఆరో రోజు ఉమ్మడి జిల్లాలో 43 దాఖలు
- అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కల్వకుర్తిలో ఎమ్మెల్యేల నామినేషన్

మహబూబ్‌నగర్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బుధవారం ఆయా నియోజకవర్గాలకు భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయగా.. నారాయణపేట, జడ్చర్ల, గద్వాల, వనపర్తి నియోజకవర్గాల్లో విపక్ష పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. మహబూబ్‌నగర్, అచ్చంపేట నియోజకవర్గాల్లో ఐదు చొప్పున, అలంపూర్‌లో నాలుగు, కొల్లాపూర్,నాగర్కర్నూల్ నియోజకవర్గాల్లో నాలుగు చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి. అచ్చంపేటలో ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ అభ్యర్థి గువ్వల బాలరాజు భారీ ర్యాలీతో నామినేషన్ దాఖలు చేశారు. నాగర్‌కర్నూల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి జనార్దన్‌రెడ్డి తరఫున ఆయన సతీమణి మర్రి జమున సీనియర్ నేత నాగం జనార్దన్‌రెడ్డితో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. కల్వకుర్తిలో బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 43మంది నామినేషన్లు ఆయా రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. నామినేషన్ సమర్పించే కేంద్రాల వద్ద అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

**మహబూబ్‌నగర్ జిల్లా నుంచి తొమ్మిది**

మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి బీజేపీ తరఫున ఏపీ మిథున్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి ఎన్నం శ్రీనివాస్‌రెడ్డి, బీఎస్పీ నుంచి స్వప్న, ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఎం.శ్రీనివాసులు, మల్యాపురం శ్రీనివాస్‌గౌడ్, జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆర్‌సీపీఐ పార్టీ తరఫున వెల్జాల బసవయ్య, బీఎంపీ నుంచి ఇమ్మడి ఆనంద్, నేషనల్ కాంగ్రెస్ నుంచి అనిరుధ్‌రెడ్డి, దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గానికి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి జి.మధుసూదన్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు.

**నాగర్‌కర్నూల్ జిల్లాలో 21**

నాగర్కర్నూల్ జిల్లాలో ఆరోరోజు నామినేషన్లు మొత్తం 21మంది నామినేషన్లు వేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి ఉదయ్‌కుమార్ తెలిపారు. నాగర్కర్నూల్ నియోజకవర్గంలో తొమ్మిది మంది, కొల్లాపూర్ నుంచి నలుగురు, అచ్చంపేట నుంచి ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. బీఆర్ఎస్ నుంచి గువ్వల బాలరాజు రెండుసెట్ల నామినేషన్లు వేశారు. బీజేపీ నుంచి సతీశ్‌మాదిగ, బహుజన సమాజ్‌వాదీ తరఫున ఎం.నాగార్జున్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరఫున చిక్కుడు వంశీకృష్ణ, ధర్మ సమాజ్ పార్టీ తరఫున చింత సాయిబాబు నామినేషన్ దాఖలు చేశారు.నాగర్కర్నూల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి మర్రి జనార్దన్‌రెడ్డి రెండుసెట్ల నామినేషన్లు వేయగా.. ఆయన సతీమణి మర్రి జమున బీఆర్ఎస్ తరఫున ఒక సెట్ నామినేషన్ వేశారు. పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి జాడిస్వామి, భారత కమ్యూనిస్టు విప్లవకారుల సక్యత కేంద్రం మార్కిస్ట్ లెనినిస్ట్ పార్టీ నుంచి కడుకుంట్ల జానకిరాంరెడ్డి, ఇండియన్ కాంగ్రెస్ పార్టీ నుంచి కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి తరఫున కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, భారత సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్ట్ పార్టీ నుంచి మిద్దె రాములు, స్వతంత్ర అభ్యర్థులుగా మూడావత్ బాలరాజు, చీమర్ల రాజేశ్వర్‌రెడ్డి, నరిగె నరేందర్ నామినేషన్ వేశారు. కొల్లాపూర్ నియోజకవర్గానికి నుంచి రాణి, ధర్మసమాజ్ పార్టీ నుంచి ఆదిసంధ్య, బీఎస్పీ తరఫున గగనం శేఖరయ్య, స్వతంత్ర అభ్యర్థులుగా కర్నె శిరీష, కాటగౌని తిరుపతమ్మ నామినేషన్లు వేశారు. కల్వకుర్తి నియోజకవర్గానికి బీఆర్ఎస్ తరఫున జైపాల్‌యాదవ్ భారీ ర్యాలీతో నామినేషన్ వేశారు. ప్రజా బంధు పార్టీ తరపున వి.అమర్‌నాథ్, స్వతంత్ర అభ్యర్థిగా వి.రేఖ్యానాయక్ నామినేషన్ దాఖలు చేశారు.మక్తల్ నియోజకవర్గానికి లెఫ్ట్ ఫ్రంట్ పార్టీ తరపున మంజుల మేతరి బహుజన నామినేషన్ దాఖలు చేశారు. నారాయణపేట నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ నుంచి పర్ణికరెడ్డి, బీజేపీ నుంచి రతంగ్‌పాండురెడ్డి, బహుజన్ సమాజ్ పార్టీ నుంచి బొదిగెలి శ్రీనివాసులు నామినేషన్ వేశారు. వనపర్తి నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ తరపున తుడి మేఘారెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా గొండి వెంకటరమణ, ధర్మ సమాజ్ పార్టీ తరపున బంకల ఎల్లయ్య నామినేషన్ దాఖలు చేశారు. గద్వాలకు కాంగ్రెస్ పార్టీ తరపున సరిత, బీఎస్పీ తరఫున పరమాల కృష్ణ నామినేషన్‌లు వేశారు. అలంపూర్‌కు కాంగ్రెస్ పార్టీ తరఫున సంపత్‌కుమార్, ధర్మ సమాజ్ పార్టీ తరపున లక్ష్మన్న, బీజేపీ తరపున మాదన్న, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి పేరపోగు ప్రసంగి నామినేషన్ వేశారు.

## భార్యను వేధించిన భర్తకు.. ఏడాది జైలు, రూ.వెయ్యి జరిమానా

గద్వాల అర్బన్, నవంబర్ 8: భార్యను అదనపు కట్నం కోసం వేధించిన కేసులో నిందితుడికి(భర్త) ఏడాది మూడు రోజుల జైలుశిక్షతోపాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ జేఎఫ్‌సీఎం న్యాయమూర్తి ఉదయ్‌నాయక్ తీర్పును వెల్లడించారు. జిల్లా కేంద్రానికి చెందిన జ్యోతి(స్వాతి)మహిళను 2014 లో కర్నూలుకు చెందిన రాజ్‌కుమార్‌కు రూ.లక్ష, రెండు తులాల బంగారు కానుకగా ఇచ్చి వివాహం చేశారు. కొన్నాళ్లు వీరి కాపురం సజావుగా సాగింది. భర్త చెడు వ్యాసనాలకు బానిసై అదనపు కట్నం తీసుకురావాలని రోజూ వేధిస్తూ 2015 జూన్‌లో ఇంటికి తరిమేశాడు. పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయతీ పెట్టినా భర్త ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. అదనపు కట్నం తీసుకోస్తేనే ఇంట్లోకి రాణిస్తానని లేకపోతే లేదని తెల్చిచెప్పాడు. ఈ ఘటనతో మహిళ తల్లీదండ్రుల ఇంట్లో ఉంటూ కోర్టును ఆశ్రయించింది. కోర్టు రిఫర్ కేసు చేయగా 2016లో గద్వాల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పటి ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టి నేరం రుజువు కావడంతో భర్త, అత్తామామలను అరెస్ట్ చేసి జ్యూడిషియల్ రిమాండ్‌కు పంపించారు. తదుపరి పరిశోధన పూర్తిచేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. బుదవారం ఇరువర్గాల వాదనల అనంతరం నేరం రుజువు కావడంతో రాజ్‌కుమార్‌కు శిక్షతోపాటు జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించారు. కేసులో నిందితుడికి శిక్ష పడేందుకు కృషిచేసిన అప్పటి డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ శ్రీనివాస్, ఎస్సై శ్రీనివాస్, ప్రస్తుత ఎస్సైలు శ్రీకాంత్, అబ్దుల్ షూకుర్, అసిస్టెంట్ పీపీ రేచల్ సంజన జాషువా, కోర్టు లైజనింగ్ అధికారి రషీద్, కోర్టు సిబ్బంది పరమేశ్, తిప్పన్నను ఎస్పీ రితిరాజ్ అభినందించారు.